అర్ధరాత్రి అక్రమ అరెస్టులు

- నిరుద్యోగులపై సర్కారుది కపట ప్రేమ
- బీఆర్ఎస్ యువజన విభాగం నేత వంశీనాయక్

అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో పోలీసులతో విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

అచ్చంపేట రూరల్, జూలై 5 : ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల భర్తీ చేయాలని బీజేవైఎం రాష్ట్ర శాఖ చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈక్రమంలో నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ముట్టడికి హాజరవుతున్నారనే సమాచారంతో పోలీసులు బీజేవైఎం రాష్ట్ర కోఆర్డినేటర్ చందూలాల్ చౌహాన్, నాయకుడు అమర్‌ను గురువారం అర్ధరాత్రి ముందస్తుగా అరెస్ట్ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున బీజేవైఎం నాయకుల ఇండ్లలో సోదాలు నిర్వహించి అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని నాయకులు విమర్శించారు. అదేవిధంగా ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో జరుగుతున్న నిరుద్యోగ ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్తున్నారన్న సమాచారంతో గిరిజన విద్యార్థి సంఘం, బీఆర్ఎస్ రాష్ట్ర, విద్యార్థి, యువజన విభాగం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వం నిరుద్యోగులతోపాటు తమను అరెస్టు చేయడం శోచనీయమని బీఆర్ఎస్ యువజనవిభాగం కొర్ర వంశీనాయక్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు అక్రమ అరెస్టులకు పాల్పడుతూ నిరుద్యోగులపై కపట ప్రేమను చూపుతున్నదన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో యువజ న విభాగం రాష్ట్ర నాయకులు కొర్ర వంశీనాయ క్, దుబ్బతండా శివ, దండ్యాలంతండా రమే శ్, రంగాపూర్ రవీందర్, రవి ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు

చారకొండ, జూలై 5 : నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగ జేఏసీ తలపెట్టిన టీజీపీఎస్‌సీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని బీఆర్ఎస్ యూత్ ప్రసిడెంట్ చండీశ్వర్, కోఆప్షన్ మాజీ మండల సభ్యుడు షేక్ సలీం, బీజేపీ నేత కన్నా అన్నారు. శుక్రవారం టీజీపీఎస్‌సీ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు అరెస్టు చేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్లు వేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల గురించి పట్టించుకోవడం లేదన్నారు. అరెస్టులతో ఉద్యమాలను అణిచివేయాలని చూస్తే ఊరుకోమని హెచ్చరించారు.

కొల్లాపూర్‌లో..

కొల్లాపూర్, జూలై 5 : సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ విద్యార్థులను, నిరుద్యోగులను దేశద్రోహులుగా చూస్తోందని, ప్రజాపాలన పేరుతో నిరుద్యోగులను వంచిస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారసింగ్ అన్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు గ్రామాల్లో తమ ఇండ్లల్లో నిద్రిస్తున్న విద్యార్థి నాయకులను ఛలో హైదరాబాద్ వెళ్లుతారని భయంతో పోలీసులు బలవంతంగా ఆదుపులోకి తీసుకున్నారు. ఉద్యోగాల నోటిఫికేషన్లు ఇవ్వకుండా నిరుద్యోగులను ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అక్రమ అరెస్టులతో నిరుద్యోగుల గొంతు నొక్కాలని చూస్తే సహించేది లేదని బీఆర్ఎస్వీ జిల్లా నాయకుడు శేఖర్ అన్నారు. అరెస్టు అయిన వారిలో ఆయా సంఘాల నాయకులు దాస్, తిరుపతినాయక్ తదితరులు ఉన్నారు.

కొల్లాపూర్ : విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

చారకొండలో బీఆర్ఎస్, బీజేపీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

జిల్లా కేంద్రంలో శ్రీకృష్ణ ఆయుత చండీహోమం

- రేపటి నుంచి 21వ తేదీ వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

ఏర్పాట్ల వద్ద స్వరూపానందస్వామిని కలిసిన ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, జూలై 5 : పట్టణంలో శ్రీకృష్ణ ఆయు త చండీహోమం కార్యక్రమాలను వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 7 నుంచి 21వ తేదీ వరకు ఆధ్యాత్మికంగా శ్రీకృష్ణ ఆయుత చండీహోమం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ పీఠాధిపతి కృష్ణ జ్యోతి స్వరూపానందస్వామి శుక్రవారం తెలిపారు. శ్రీకృష్ణ కాలచక్రం ఆ యుత చండీ అతిరుద్రం, శ్రీసీతారామ సామ్రాజ్య మహాగణపతి, మహాసార దర్శన లక్ష్మీనారాయణ సహిత శ్రీమద్ భగవద్గీత 83వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవాల్లో లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన, 10 వేల పార్థివ లింగార్చన, అమ్మవారి లక్షగాజుల సమర్పణ, శ్రీ రాధాకృష్ణ కల్యాణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి పరిశీలించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వహించొద్దు

నాగర్‌కర్నూల్, జూలై 5: ఆరోగ్యంపై ప్రజలు అశ్రద్ధ వహించొద్దని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం యశోధ ఆసుపత్రి మలక్‌పేట హైదరాబాద్, ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి తూడుకుర్తి వారి సంయుక్త ఆధ్వర్యంలో తెలకపల్లి మండలంలో కమ్మారెడ్డిపల్లిలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వివేకానంద వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి సంపత్‌కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జయకుమార్, హైదరాబాద్ గాంధీ స్మారకనిధి ప్రతినిధి, హైదరాబాద్ జేఎస్ఆర్ ఫౌండర్ సతీశ్‌రెడ్డి, కమ్మారెడ్డిపల్లి ఉపసర్పంచ్ జానకీరాంరెడ్డి, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

ఎల్‌వోసీని అందజేస్తున్న వేణుగోపాల్‌రావు

కోడేరు, జూలై 5 : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ఎల్లపాగ రాముడు పక్షవాతంతో నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. వైద్యం చేయించుకోవడానికి అవసరమైన డబ్బులు లేక ఇబ్బందులు పడుతున్నారు. మాజీ స ర్పంచ్ ఎల్లేని వేణుగోపాల్‌రావుగా ఎక్సైజ్ పర్యాటక శాఖ మం త్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లా రు. స్పందించిన మంత్రి ప్రభుత్వం నుంచి రూ.3.80లక్షల ఎల్‌వోసీ మంజూ రు చేయించారు. ఆ ఎల్‌వోసీని శుక్రవారం హైదరాబాద్‌లో ఎల్లపాగ రాముడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం

దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్, జూలై 5 : హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేసిన ఏఐసీసీ నాయకుడు రాహుల్ గాంధీ హిందువులకు వెంటనే బహిరంగంగా క్షమాపణ కోరాలని కల్వకుర్తి హిందువాహని, హిందు ధర్మ పరిరక్షణ సమితి, బీజేపీ, బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీ రాహుల్‌గాంధీ నిండు పార్లమెంట్‌లో హిందువులను కించపరిచేలా మాట్లాడడం చాలాదారుణమన్నారు. ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు మళ్లీ చేస్తే తాము, యావత్ హిందూ సమాజం ఊరుకునేది లేదని హెచ్చరించారు. అనంతరం పాలమూరు చౌరస్తాలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి హిందువాహని, హిందు ధర్మ పరిరక్షణ సమితి, బీజేపీ, బీజేవైఎం, ఆర్ఎస్ఎస్ నాయకులు ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కల దాడి

- 9 గొర్రెలు మృతి, ఐదింటికి గాయాలు

లింగాల, జూలై 5 : కుక్కల దాడిలో తొమ్మిది గొర్రెలు మృతి చెందగా ఐదింటికి గాయాలైన ఘటన మండలంలోని వల్లభాపూర్‌లో చోటచేసుకున్నది. గ్రామస్తుల కథనం మేరకు గొర్రెలకాపరి ఇడమోని తిరుపతయ్యకు చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి లింగాల మండలంలోని వల్లభాపూర్, బల్మూర్ మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామాల మధ్యలో ఓ యజమాని షెడ్డు ఏర్పాటు చేసి కోళ్లను పెంచుతున్నాడన్నారు. ఆ షెడ్డులో చనిపోయిన కోళ్లను వల్లభాపూర్ శివారులో పడవేయడంతో వాటిని తినేందుకు కుక్కలు అలవాటు పడ్డాయన్నారు. ఒకానొక సందర్భంలో తినేందుకు చనిపోయి కోళ్లు లేకపోతే చుట్టుపక్కల కనిపించిన జంతువులపై కుక్కలు దాడి చేస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే శుక్రవారం అటుగా వెళ్లిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా 4 గొర్రెలు, 5 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో ఐదింటికి తీవ్ర గాయాలయ్యాయన్నారు. మృతి చెందిన గొర్రెల విలువ దాదాపు రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు.

విషయం తెలుసుకున్న గ్రామస్తులు కొందరు కోళ్ల షెడ్డు వద్దకు వెళ్లి ఆందోళన చేయగా చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లిస్తానని షెడ్డు యజమాని చెప్పడంతో వారు ఆందోళనను విరమించారు. కార్యక్రమయంలో మాజీ ఉపసర్పంచ్ లింగస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు

కల్వకుర్తి, జూలై 5 : 18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ముస్కాన్ ఆపరేషన్ టీం ఎస్సై అంజయ్య హెచ్చరించారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని మెకానిక్ షెడ్లు, బట్టలు, ఫర్నిచర్ దుకాణాల్లో ముస్కాన్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసు నమోదుతోపాటు జరిమానాలు విధిస్తామని ఎస్సై చెప్పారు. జూలై 31వ తేదీ వరకు ముస్తాన్ అపరేషన్ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సప్తగిరి, డీసీపీయూ యూనిట్ మధుబాబు, కోనేరు సంస్థ కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌యాదవ్, చైల్డ్ లైన్ ప్రమీల, ఏఎస్ఐ నర్సింహ, హెడ్ కానిస్టేబుల్ పాండునాయక్, ఉమెన్ కానిస్టేబుల్ అరుణ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WANTED
★ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ని చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం జీతం 16K to 18K ఏజెంట్ కమిషన్ 6K. 9640258899, 9640468899.
NT-325758
ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ఉపాధ్యాయులకు సన్మానం

ఉప్పునుంతల/కల్వకుర్తి, జూలై 5 : మండలంలోని కంసానిపల్లి ప్రైమరీ స్కూల్ నుంచి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం శాలువా, పూలమాలతో సన్మానించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్ది బదిలీపై వెళ్లడం బాధగా ఉన్నదని విద్యార్థులు కన్నీటి పర్యంతమయ్యారు. పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసిన విజయ్‌కుమార్, ఆంజనేయులు, అంబికను గ్రామస్తులు సత్కరించారు. అనంతరం బదిలీపై ఇక్కడికి వచ్చిన ఉపాధ్యాయులు రాములునాయక్, జగదీశ్వర్, రాజేశ్, నర్మదను సన్మానించారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన పది మంది ఉపాధ్యాయులను సన్మానించారు.కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సరళ, మల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శ్రీనివాస్‌గౌడ్‌కు..

శ్రీనివాస్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బిజినేపల్లి, జూలై 5 : ఎంపీపీగా శ్రీనివాస్ గౌడ్ పదవీకాలం ముగియడంతో మండల కేంద్రంలోని బిజినేపల్లిలో శుక్రవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. వివిధ పార్టీల నాయకులు, సిండికేట్ సభ్యులు పూలమాల శాలువాలతో సత్కరించారు. పదవీకాలంలో ఉన్నసమయంలో మండలాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పులేందర్‌రెడ్డి, వెంకటస్వామి, సుదర్శన్‌గౌడ్, అమృత్‌రెడ్డి, మాన్యానాయక్, మల్లేశ్, శ్రీశైలం, లింబ్యానాయక్ తదితరులు ఉన్నారు.

కుక్కలకు రేబిస్ టీకాలు

అమ్రాబాద్, జూలై 5 : ప్రపంచ జూ నోసిస్ డే సందర్భంగా అమ్రాబాద్, పదర మండలాల్లో కుక్కలకు ఉచిత రేబిస్ టీకాలను పంపిణీ చేయనున్నట్లు ఉమ్మడి మండలాల పశు వైద్యాధికారి అనిల్ శుక్రవారం తెలిపారు. ఉమ్మడి మండలాల్లో ఉన్న జంతు ప్రేమికులు, ప్రజలు కుక్కలకు టీకాలు వేయించాలని ఆయన కోరారు.

నేడు అవగాహన సదస్సు

వంగూరు, జూలై 5 : ఉద్యాన పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై శనివారం మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామంలోని రైతువేదికలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏవో తనూజ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు జిల్లా ఉద్యానవన, వ్యవసాయ, పట్టు పరిశ్రమ, అయిల్‌పాం అధికారులు హాజరవుతున్నందున రైతులు పెద్దత్తునా హాజరు కావాలని ఏవో కోరారు.

10న కంటి వైద్య శిబిరం

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 5 : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా దవాఖానలో ఈనెల 10వ తేదీన ఉదయం 9 గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు రిటైర్డ్ ఆప్తాలమిక్ ఆఫీసర్ శివారెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వివరాలకు 9440454284కి సంప్రదించాలన్ని కోరారు.

రెండు బైకులు ఢీ

బిజినేపల్లి, జూలై 5 : రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడిన ఘటన బిజినేపల్లి–పాలెం గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై శుక్రవారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగనూర్ గ్రామానికి చెందిన తిరుపతయ్య(36) తన బైక్‌పై నాగర్‌కర్నూల్ నుంచి మంగనూర్‌కు వెళ్తున్నాడు. ఇదేక్రమంలో మండలంలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన సాయికుమార్ తనబైక్‌పై బిజినేపల్లి నుంచి ఖానాపూర్‌కు వెళ్తుండగా పాలెం, బిజినేపల్లి మార్గమధ్యంలో బైకులు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఈ ప్రమాదంలో తిరుపతయ్య అక్కడికక్కడే మృతి చెందగా, సాయికుమార్‌కు గాయాలయ్యాయని తెలిపారు.

కేంద్రం బొగ్గు గనుల వేలాన్ని ఆపాలి

జిల్లా కేంద్రంలో నిరసన తెతియస్తున్న సీపీఎం, సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్, జూలై 5 : దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగాన్ని విచ్ఛిన్నం చేస్తూ పెట్టుబడిదారులకు కట్టబెట్టడానికి కుట్రలు చేస్తుందని, అందులో భాగంగానే దేశంలో బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తున్నదని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు పర్వతాలు, బాల్‌నర్సింహ విమర్శించారు. బొగ్గు గనుల వేలాన్ని ఆపి నేరుగా సింగరేణికి బొగ్గును కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా దగ్గర సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి దగ్గర ఉన్న బొగ్గు గనులను వేలం వేయడం ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తుందని విమర్శించారు. బీజేపీ ప్రభుత్వం గత పదేండ్లలో 200 బొగ్గు గనులను దేశ వ్యాప్తంగా వేలం వేసిందని, ఇప్పుడు మూడో సారి గెలిచి 69బొగ్గు గనులను దేశంలో వేలం వేయడానికి కుట్ర చేస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి 8మంది ఎమ్మెల్యేలు, 8 మంది ఎంపీలు ఉండికూడా తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడం లేదని, ఆపడం లేదని పైగా కేంద్ర ప్రభుత్వానికి వంత పాడటం సిగ్గుచేటని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ జిల్లా నాయకులు ఆనంద్‌జీ, శ్రీనివాసులు, వెంకటయ్య, అశోక్, కేశవులుగౌడ్, రామయ్య, కృష్ణాజీ, లక్ష్మీపతి, సురేశ్, కాశన్న, మధు, సత్యనారాయణ, శివరాం, సురేశ్, సుభాష్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

180 కిలోల బెల్లం పట్టివేత

స్వాధీనం చేసుకున్న బెల్లం బస్తాలతో ఎక్సైజ్ పోలీసులు

కల్వకుర్తి, జూలై 5 : 180 కిలోల బెల్లాన్ని, 4 లీటర్ల సారాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న ఘటన శుక్రవారం కల్వకుర్తి మండలంలో చోటు చేసుకున్నది. కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్ రెడ్డి కథనం మేరకు సారా తయారీకి వినియోగించే నల్లబెల్లాన్ని కల్వకుర్తి మండలం ఎల్లికల్ తండాకు సరఫరా చేశారనే సమాచారంతో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేశారు. తనిఖీలో భాగంగా మెగావత్ గుండియా నాయక్ ఇంట్లో తొమ్మిది సంచుల్లో 180 కిలోల బెల్లం, నాలుగు లీటర్ల సారాను గుర్తించి వాటిని స్వాధీ నం చేసుకుని కల్వకుర్తి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తర లించారు. గుండి యా నాయక్‌పై కేసు నమోదు చేసి అతన్ని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. దాడులు నిర్వహించి బెల్లాన్ని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ సిబ్బందిని నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయిత్రి అభినందించారు. కార్యక్రమం లో ఎక్సైజ్ సిబ్బంది సిరాజ్, మహేశ్, నార్యా, రఘుపతి, పురుషోత్తం, భీమమ్మ ఉన్నారు.

రాయి బ్లాస్టింగ్‌కు పర్మిషన్ లేదు

ట్యాంకును పరిశీలిస్తున్న తాసీల్దార్

ఊర్కొండ, జూలై 5 : గుట్టపై ఉన్న రాయిని బ్లాస్టింగ్ చేసేందుకు ఎలాంటి పర్మిషన్ ఇవ్వలేదని తాసీల్దార్ చిన్నకిష్టప్ప, ఎస్సై వీరబాబు తెలిపారు. మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న గుట్టపై ఉన్న కోనేరు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులను శుక్రవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ స మీపంలో ఎలాంటి పర్మిషన్ లేకుండా రాయిని బ్లాస్టింగ్ చేస్తున్నారని సమాచా రం వచ్చిందని ఇక్కడ బ్లాస్టింగ్ చేసిన ట్లు ఎలాంటి ఆధారాలు లేవని చెప్పారు. అనంతరం ఇక్కడ రాయిని తీస్తున్న వడ్డెర కులస్తులు, గ్రామస్తులను పిలిచి మాట్లాడారు. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు సమీపంలో రాయి తీయడానికి ఎలాంటి అనుమతులు లేవని ఎవరైనా రాయిని తీసేందుకు ప్రయత్నిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట ఆర్ఐ సతీశ్‌తో పాటు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుమతితోనే మట్టిని తరలించాలి : తాసీల్దార్


స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమ

లింగాల, జూలై 5 : మండలంలోని అంబట్‌పల్లి శివారులో చేపట్టిన అక్రమ మట్టి తవ్వకాలను తాసీల్దార్ ఉమ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబట్‌పల్లి శివారులో కేసీతండాకు వెళ్లే మార్గంలోని 406 సర్వే నంబరులో 5–15 ఎకరాల ప్రభుత్వ భూమి(తుర్కగుట్ట) ఉన్నట్లు తెలిపారు. అంబట్‌పల్లికి చెందిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు తమ అవసరాల కోసం మట్టి ని తరలిస్తున్నట్లు అదే గ్రామానికి చెందిన బం గారయ్య ఫిర్యాదు చేశాడని.. ఆర్డీవో ఆదేశాల మేరకు ఘటనా స్థలాన్ని పరిశీంచినట్లు ఆమె పేర్కొన్నారు. కాగా అప్పటికే మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయని తెలిపారు. మట్టి తరలింపునకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. తాసీల్దార్ వెంట ఆర్ఐ సీతారాం ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్‌వో సుధాకర్

వంగూరు, జూలై 5 : వర్షాకాలం నేపద్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సీహెచ్‌వో సుధాకర్ ఆశ కార్యకర్తలకు సూచించారు. ఆశ డే సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో సీహెచ్‌వో మాట్లాడారు. సీజనల్ వ్యాధులైన మలేరియా, చికెన్ గున్యాతోపాటు వైరల్ జ్వరాలు, వాంతులు, వీరేచనాలు రాకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. సమావేశంలో సూపర్ వైజర్లు పద్మ, రోజమ్మ, హెల్త్ అసిస్టేంట్ మేషక్, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల దొంగలు రిమాండ్

కోడేరు, జూలై 5 : కోడేరు, కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో రైతుల వ్యవసాయ పొలాల్లో అమర్చిన విద్యుత్ తీగలను దొంగిలించి పట్టుబడిన ఐదుగురు దొంగలను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చారు. అందులో ముగ్గురిని రిమాండ్‌కు తరలించగా మరో ఇద్దరిని స్టేట్ హోంకు తరలించినట్లు కోడేరు ఎస్సై కురుమూర్తి శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం మేరకు కొల్లాపూర్ మండలానికి చెందిన వంశీ, శివకుమార్, పుల్లయ్య, ఇర్ఫాన్, శివతేజ కొంత కాలంగా కోడేరు కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల్లో రైతుల వ్యవసాయ పొలాల్లో ఉన్న విద్యుత్ తీగలను దొంగిలిస్తున్నారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన కోడేరు మండలం ఎత్తం గ్రామ శివారులో రైతుల పొలాల్ల ఉన్న విద్యుత్ తీగలను దొంగిలిస్తు రైతులకు పట్టుబడ్డారు. పట్టుబడిన దొంగలను రైతులు పోలీసులకు అప్పగించారు. విచారణ అనంతరం శుక్రవారం సాయంత్రం కొల్లాపూర్ కోర్టులో హాజరు పర్చగా వంశీ, శివకుమార్, పుల్లయ్యలను జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని, అలాగే ఇర్ఫాన్, శివతేజ మైనర్లు కావడంతో వారిని స్టేట్ హోంకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు సమావేశం

అచ్చంపేట టౌన్, జూలై 5 : నూతన చైర్ పర్సన్ ఎన్నిక కోసం మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు.

టీపీవోపై దాడి

కల్వకుర్తి రూరల్, జూలై 5 : కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై కల్వకుర్తి టీపీవో విజయ్ కుమార్(టౌన్ ప్లానింగ్ ఆఫీసర్) విచారణకు వెళ్లగా అతడిపై పట్టణానికి చెందిన శ్రీకాంత్‌దాడి పాల్పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకున్నది. శ్రీకాంత్ కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌లో మిర్చి గిర్ని నిర్వహిస్తుండగా గిర్ని వల్ల కాలనీ వాసులకు అంతరాయం కలుగుతోందని పేర్కొంటూ మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణకు వచ్చిన విజయ్‌కుమార్‌పై దాడి చేయడంతో దాడి పాల్పడిన వ్యక్తి శ్రీకాంత్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు ఫిర్యాదుచేశాడు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందజేత

కల్వకుర్తి, జూలై 5 : కల్వకుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెచ్ఈసీ చదువుతున్న పేద విద్యార్థిని ఆదిలక్ష్మికి శుక్రవారం బీఆర్ఎస్ కల్వకుర్తి పట్టణాధ్యక్షుడు బావండ్ల మధు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఆదిలక్